క్లుప్తంగా

అమ్మవార్లకు ఎమ్మెల్యే పల్లా పూజలు



జనగామ రూరల్: పట్టణంలోని గిర్నిగడ్డ రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, విజయ దుర్గమ్మ పండుగ మహోత్సవానికి శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై అమ్మవార్లకు పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలు, ఆరోగ్యంగా ఉండాలని అమ్మవార్లను ఎమ్మెల్యే కోరారు.

కులగణనలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్



జనగామ: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కులగణనలో దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా ఆయన కలిసి ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. రాహుల్ గాంధీ ఒత్తిడి తోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. ఆయన వెంట నాయకులు దూడల సిద్ధయ్య గౌడ్, రవి, శ్రీనివాస్, జాయ మల్లేష్, వేముల మల్లేశం, మధు, వెంకటేష్, రవి, శ్రీనివాస్, ఎదునూరి రవీందర్, వెంకన్న, వెంకటేష్, మధు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



దేవరుప్పుల: అధికారుల అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం నీర్మాలలో కొప్పుల భిక్షపతికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలోని వాగు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచుతూ సత్వర చర్యలు చేపడుతామన్నారు. హెడ్ కానిస్టేబుల్ సదయ్య, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటండి



మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు సిద్ధంగా ఉండి సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కడకంచి రమేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా పదాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భారతీయ జనతా పార్టీ 1,100 వందలకు పైగా క్రియాశీల సభ్యులతో బలోపేతమై ఉందని అన్నారు. ఈనెల 4వ తేదీతో సంస్థాగత ప్రక్రియ పూర్తి కానుందన్నారు. సమావేశంలో నందా రెడ్డి, ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేశ్, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

వాటర్ బాటిళ్లు, టోపీల పంపిణీ



రఘునాథపల్లి: గోవర్ధనగిరి జాతీయ ఉపాధిహామీ కూలీలకు ప్రమీల చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం వాటర్ బాటిళ్లు, టోపీలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధి ఉరే ప్రమీల గ్రామశివారులో పని చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి 200 వాటర్ బాటిళ్లు, 150 టోపీలు అందజేసి ఔదార్యం చాటారు. ఈ సందర్భంగా కూలీలు దాతృత్వం చాటిన ప్రమీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ విజయలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ కుంట రవి, నర్రా మల్లారెడ్డి, పరిపూర్ణాచారి, బండి కిష్టయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- మిషన్ భగీరథ పైపులైన్ లేక మూడేళ్లుగా తిరుగుతున్న కాలనీవాసులు
- నెల్లుట్లలోని గణేష్ టౌన్‌షిప్ కాలనీని ఎవరూ పట్టించుకోని పరిస్థితి



తాగునీటికి తిప్పలు పడుతున్న గణేష్ టౌన్ షిప్ కాలనీ

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల పరిధిలో ఉన్న గణేష్ టౌన్ షిప్‌లో మిషన్ భగీరథ పైపులైన్ లేక కాలనీవాసులు నీటికి తిప్పలు పడుతున్నారు. మూడేళ్లుగా కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటని అందించాలని కాలనీవాసులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్న కాలనీలో జీపీ నుంచి ఎలాంటి నీటి వసతిని ఏర్పాటు చేయలేదు. కాలనీవాసులంతా జీపీకి అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికి నీటికి ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న ట్యాంక్‌కు సరఫరా చేసే బోరులో నీరు అడుగంటి సరిపడా అందివ్వలేకపోతోంది. దీంతో కొంత మంది ప్రైవేట్‌గా వేసుకున్న తమ బోర్ల నుంచి కాలనీ వాసులకు తాగు నీటిని అందిస్తున్నారు. రాబోయే వేసవిలో మరింత తాగునీటి ఇబ్బందులు ఏర్పడకముందే కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



సుమారు వంద కుటుంబాలు ఉంటున్న కాలనీలో తాగునీటికి ఇబ్బంది ఏర్పడుతోంది. మూడేళ్లుగా మిషన్ భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఇటీవల కొత్తగా వచ్చిన జిల్లా పంచాయతీ అధికారిని కూడా కలిశాం. ఉన్నతాధికారులు స్పందించి నీటి వసతిని కల్పించాలి.

\- జె. సుధీర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం

గణేష్ టౌన్ షిప్‌లో మిషన్ భగీరథ పైపులైన్ కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపించాం, సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని, ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. మిషన్ భగీరథ పథకంలో నిధులు మంజూరయ్యేంత వరకు ఆగాలని, లేనిచో గ్రామ పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెప్పారని, జీపీలో ప్రస్తుతం అన్ని నిధులు లేవు.

\- రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, నెల్లుట్ల

భూసమస్యలు లేని మండలమే లక్ష్యం

- ఆర్డీఓ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: మండలాన్ని భూ సమస్యలు లేని మండలంగా చేసేలక్ష్యంగా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆర్డీఓ డీఎస్.వెంకన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా రెండో విడతలో స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఎంపిక కాగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో భూభారతిపై ఆర్డీఓ శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం ఎంపిక కావడం సంతోషకరమని, భూ సమస్యలు లేని మండలంగా చేసేందుకు మంచి అవకాశమన్నారు. వివిధ గ్రామాల ప్రజలు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారం చేసుకోవాలన్నారు. భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 5 నుంచి 13వ తేదీవరకు రెవెన్యూ గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామసభల షెడ్యూల్

ఈనెల 5వ తేదీన విశ్వనాథపురం, కొత్తపల్లి, 6న తానేదార్‌పల్లి, రాఘవాపూర్, 7న నమిలిగొండ, మీదికొండ, 8న స్టేషన్‌ఘన్‌పూర్, ఛాగల్లు, 9న తాటికొండ, పాంనూర్, 12న సముద్రాల, శివునిపల్లి, 13వ తేదీన ఇప్పగూడెం గ్రామంలో భూభారతి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి తహసీల్దార్లు డి.వెంకటేశ్వర్లు, ఎండీ.మోసీన్‌ముజ్‌తబా, ఆర్ఐలు శ్రీకాంత్, సతీష్, డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నర్మెట: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 5 నుంచి 20 వరకు అందుబాటులో ఉంటాయని, పదో తరగతి మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని, 27 నుంచి 31 వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, ఉచిత పుస్తకాలు, ఈఏ పీసీఈటీ, నీట్ కోచింగ్‌తో పాటు కెరీర్ కౌన్సిలింగ్, బాలికలకు హాస్టల్ వసతి ఉంటుందన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభం



బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు

జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ 15 రోజుల వేసవి శిక్షణ శిబిరాన్ని అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదెపాక అయోధ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా కోశాధికారి కాటం రాజిరెడ్డి అధ్యక్షత వహించగా అయోధ్య మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ చిర్రబోయిన సంధ్య శ్రీనివాస్, స్వచ్ఛంద సేవకులు చేగొండ నరహరి, సీనియర్ క్రీడాకారుడు కేశవరెడ్డి, క్యాంపు కోచ్ ముచ్చ సుధాకర్‌రెడ్డి, చందర్, దాట్ల అశోక్, రాకేష్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్, జాతీయ స్థాయి షూటింగ్ బాల్ క్రీడాకారుడు సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

సమసిన డబ్బాల తొలగింపు వివాదం



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: మండల కేంద్రంలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు గ్రామ దేవతల ఉత్సవాల నేపథ్యంలో బస్టాండ్ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం ఎదుట చిరు వ్యాపారుల డబ్బాల తొలగింపు వివాదం కొలిక్కి వచ్చింది. ఉత్సవాలు ముగిసిన అనంతరం తిరిగి డబ్బాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా డబ్బాలు తొలగించేందుకు వ్యాపారులు అంగీకరించారు. ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాలు చేసే సమయంలో స్థల సమస్య ఉన్నందున సమీపంలో ఉన్న దాదాపు 20 డబ్బాలను తొలగించాలని చిరువ్యాపారులను ఆలయ కమిటీ కోరింది. డబ్బాల తొలగింపునకు వ్యాపారులు ససేమిరా అనడంతో రెండు, మూడు రోజులుగా వ్యాపారులు, ఆలయ కమిటీ మధ్య వాగ్వాదం జరుగుతోంది. శుక్రవారం సాయంత్రం ఆలయ కమిటీ ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో ఉన్న డబ్బాలను తొలగించని కారణంగా గ్రామ దేవతల ఉత్సవాలు వాయిదా వేస్తున్నట్లు గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. దీంతో శనివారం జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై నరేష్ ఆలయం వద్దకు చేరుకుని చిరు వ్యాపారులు, ఆలయ కమిటీతో మాట్లాడారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు డబ్బాలు తొలగించి, తర్వాత తిరిగి ఏర్పాటు చేసుకునేలా సీఐ నచ్చజెప్పడంతో అంగీకారం తెలిపి డబ్బాలను తొలగించారు.

కమ్యూనిస్టు పార్టీలు దేశానికి అవసరం

మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఎంతో అవసరమని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో శనివారం సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజారెడ్డి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచమంతా సోషలిజం వైపు చూస్తోందని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉన్న ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, రానున్న రోజులు కమ్యూనిస్టులవే అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సముద్రాల రాజు, నాయకులు తోట రమేష్, జీడి ఆశీర్వాదం, బూర్ల యాదగిరి, ఎండీ.రహ్మతుల్లా, బందారు యాదగిరి, ఎండీ.యూనస్, సాయిలు, నర్సయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పక్షపాత వైఖరి సరికాదు’



బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కమిషనర్ అధికార కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతూ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అన్నారు. ఘన్‌పూర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల విషయంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అధికార కాంగ్రెస్ పార్టీకి వత్తాసుగా పక్షపాత ధోరణితో వ్యవహరించడం ఏమాత్రం సరికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఫ్లెక్సీలను అలాగే ఉంచుతూ కేవలం బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీల తొలగింపచేయడం పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించకపోతే సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కనకం గణేష్, మారెపల్లి ప్రసాద్, మల్లేష్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న విజేందర్

జనగామ రూరల్: దళిత యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి విజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన బేడ బుడగ జంగాలకు చెందిన దళిత యువకుడు ఊపిరి అజయ్ కుమార్‌పై విచక్షణ రహితంగా దాడి చేసి చిత్రహింసలకు గురిచేసిన బీజేపీ ఆర్ఎస్ఎస్ బజరంగదళ్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. సురేష్, ఉపేందర్, దాసగాని సుమ, సోమన్న పాల్గొన్నారు. అలాగే బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేరుపోతుల మల్లేషం పట్టణంలోని విజయఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతిస్థిమితం లేని దళిత యువకుడిపై దాడి చేయడం సరికాదన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊపేక్షించం



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ ఆండాలు

కొడకండ్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఊపేక్షించబోమని మార్కెట్ చైర్మన్ నల్ల ఆండాలు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల తీరును ఆమె పరిశీలించారు. పారదర్శకంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రైతులకు బాసటగా నిలువాలని నిర్వాహకులకు సూచించారు. మార్కెట్ డైరెక్టర్ దేశగాని నాగరాజు, ఏపీఎం సత్యనారాయణ, సీసీ సోమయ్య ఉన్నారు.

గోవర్ధనగిరి భజన మండలికి తృతీయ బహుమతి



ప్రశంసపత్రాలతో భజన మండలి బృందం

రఘునాథపల్లి: హైదరాబాద్ ముచ్చింతల్‌లో జరిగిన శ్రీ రామానుజ 1,008వ జయంతి సందర్భంగా నిర్వహించిన భజన పోటీల్లో మండలంలోని గోవర్ధనగిరికి చెందిన ఆధ్యాత్మిక రాధాకృష్ణ భజన మండలి పాల్గొని తృతీయ బహుమతి అందుకుంది. శ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముచ్చింతల్ నుంచి అందిన ఆహ్వానం మేరకు గురు, శుక్రవారంలో జరిగిన భజన పోటీల్లో భక్తిశ్రద్ధలతో భజనలు చేసి తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలి



జఫర్‌గఢ్: సన్మానం పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీకాంత్

దేవరుప్పుల: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఆశించిన రంగాల్లో ఉజ్వల భవిష్యత్ కోసం పునాదులు వేసుకోవాలని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలలో మండల తృతీయ టాపర్ కాముని సిద్ధార్థ, అంబటి అక్షయ తదితరులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఐఐటీ విద్యను అందిస్తూ కూడా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం గమనార్హమన్నారు. ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ టెన్త్ టాపర్లను ప్రిన్సిపాల్ శ్రీకాంత్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు టెన్త్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

కేజీబీవీలో..

లింగాలఘణపురం: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేజీబీవీ విద్యార్థులను స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ సన్మానించారు. పాఠశాలలో 39 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 565 మార్కులు సాధించి మండలంలో సెకండ్ టాపర్‌గా నిలిచిన శ్రీకారుణ్యను ఉపాధ్యాయులు అభినందించారు.

వార కల్యాణం



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. భక్తులకు సైదాపూర్‌కు చెందిన బర్మావత్ గణపతి–లక్ష్మి, తిరుపతి–మౌనికలు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, లక్ష్మి, మల్లికార్జున్, హరిశంకర్, వసంత, మహేష్, గాదె శేఖర్, రాజేష్, విశాల్, కృష్ణ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పాలకుర్తి: ఈరవెన్ను గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, కొమురోజు సోమన్న, గోనే మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మల్లేష్, బాబు, ఎల్లస్వామి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బచ్చన్నపేట: మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం కేసిరెడ్డిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దివ్య అరవింద్ రెడ్డి, కార్యదర్శి అనిల్, కారోబార్ శ్రీనివాస్, గాలి తిరుపతి, భాస్కర్‌రెడ్డి, మామిడాల భాస్కర్, తుడుం సందీప్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

బచ్చన్నపేట: ప్రభుత్వ కళాశాలలోనే తమ పిల్లలను చేర్పించాలని అధ్యాపకుడు కె.శ్రీధర్, సీహెచ్ స్వేత అన్నారు. కట్కూర్ వీఎస్సార్‌నగర్‌లో శనివారం అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలలో ఫీజుల భారంతో పాటు అనేక వ్యయప్రయాసాలకు గురికావలసి వస్తుందన్నారు. చేర్యాల ప్రభుత్వ కళాశాలలో విశాలమైన తరగతి గదుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించబడుతుందని అన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉపకార వేతనాలు, బస్‌పాస్ సౌకర్యం కలదని చెప్పారు. బైపీసీ, సీఈసీ, ఎంపీసీ తోపాటుగా ఒకేషనల్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కె.స్వప్న, బి.అనూష్, వి.శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఆక్యుప్రెషర్ థెరపీ క్యాంపు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక వాసవీ వనిత ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో గత ఆరురోజులుగా నిర్వహిస్తున్న ఆక్యుప్రెషర్ థెరపీ ట్రీట్‌మెంట్ క్యాంపు(నాచురోపతి శిబిరం) శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు గన్ను కళావతి, ప్రధాన కార్యదర్శి పోకల మంజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లబ్ జోన్‌చైర్మన్ గార్లపాటి శ్రీలత హాజరై మాట్లాడారు. వాసవీ వనిత ప్లాటినం క్లబ్ కోశాధికారి గన్ను జయలలిత పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విజయవంతం చేయాలి

రఘునాథపల్లి: మూడు దశాబ్దాల అలుపెరుగని సామాజిక ఉద్యమ నిర్మాతగా వర్గీకరణ విజయ ఫలాలు జాతికి అందించనున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకు త్వరలో చేపట్టనున్న సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గద్దల కిషోర్‌కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు సుంచు సురేందర్‌మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ విభాగాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బిర్రు నాగేష్‌యాదగి, జేరిపోతుల సుధాకర్‌మాదిగ, ఏలియా, దర్శనాల రవి, కొమ్మగల్ల కృష్ణ, మచ్చ అబ్బయ్య, అరూరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి గ్రామ దేవతల ఉత్సవాలు

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండలకేంద్రంలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించే గ్రామ దేవతల ఉత్సవాలకు శనివారం గ్రామ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఉత్సవాల వివరాలు వెల్లడించారు. 4వ తేదీన ఉదయం బొడ్రాయికి నీళ్లు పోయడం, సాయంత్రం పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ దేవతలకు బోనాలు, 5న రేణుకా ఎల్లమ్మ తల్లికి పుట్ట కమ్మడం, 6న రేణుకా ఎల్లమ్మ–జమదగ్ని కల్యాణం, సాయంత్రం బోనాలు, 7న ఊరుమ్మడిగా విజయ దుర్గామాతకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. 8వ తేదీన ఉదయం ఆలయం ఎదుట యాటలు బలి ఇవ్వడంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

కొడకండ్ల: మండలంలోని కొడకండ్ల ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్‌తో పాటు ఏడునూతుల, మొండ్రాయి ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 5వ తేదీ నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్న మండల ఎంఈఓ గ్రేస్‌కేజీయారాణి తెలిపారు. కరాటే, బాక్సింగ్, డాన్స్, పాటలు, మ్యూజిక్, స్టోరిస్, స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర స్కిల్స్‌పై వేసవి శిబిరాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఆసక్తి కలిగిన ఆయా గ్రామాల పరిధిలోని పదో తరగతిలోపు విద్యార్థులంతా వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకొవాలని ఆమె కోరారు.

పోక్సో కేసు నమోదు

బచ్చన్నపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను జగదేవ్‌పూర్ మండలానికి చెందిన యువకుడు కిడ్నాప్ చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు పోక్సో కేసునమోదు చేశారు. సున్నిత విషయం కావడంతో ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ ఆధ్వర్యంలో కేసుదర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తులకు దేహశుద్ధి

బచ్చన్నపేట: చిన్నరాంచెర్ల గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను పట్టుకుని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చిన సంపత్, తుర్కపల్లి భరత్, భరత్ సిద్ధులు.. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడగా సదరు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అక్క నిశ్చితార్థానికి వచ్చి యువతి దుర్మరణం



కంకటి అఖిల (ఫైల్)

దేవరుప్పుల: అక్క నిశ్చితార్థానికి వచ్చి సరదా కోసం ఈతకువెళ్లిన ఓ యువతి దుర్మరణం పొందిన ఘటన చిన్నమడూరులో శనివారం చోటచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ కథనం మేరకు .. దేవరుప్పుల మండలం చిన్నమడూరుకు చెందిన కంకటి రాములు మూడో కూతురు అఖిల (20) డీగ్రీ చదివి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో సేల్స్‌రిప్రజెంటివ్‌గా విధులు నిర్వర్తిస్తోంది. శుక్రవారం తన అక్కకు పెళ్లి నిశ్చయం కాగా నిశ్చితార్థానికి స్వగ్రామానికి వచ్చింది. శనివారం మరో యువతిని తీసుకొని గ్రామ శివారులోని తోటబావి వద్దకు సరదాగా వెళ్లింది. ఈత వచ్చిన అఖిల బావిలో దూకి ఈత కొడుతుండగా ఆమెకున్న మూర్ఛ వ్యాధితో మునిగి పోయింది. నాలుగు గంటల తర్వాత మృతదేహం తేలడంతో విషయం వెలుగు చూసింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్సై పేర్కొన్నారు.